**జరిగిన కథ :** ధారానగరాన్ని పాలించే భోజ మహారాజుకు, కవి కాళిదాసుతో అనుకోని తగాదా వచ్చిపడింది. ఆయన కాళిదాసుతోపాటుగా.. భార్యను కూడా దూరం చేసుకున్నాడు. వాళ్లిద్దరినీ వెతుక్కుంటూ వెళ్తున్న సమయంలో ఘోటకముఖుడు అనేవాడు భోజరాజుకు సాయం చేయడానికి ముందుకు వచ్చాడు. తాము ఏడుగురం స్నేహితులం కాశీలో చదువుకుని, ధారానగరంలో కొలువు సంపాదించుకోవడానికి వెళ్తున్నామని చెప్పాడు. కాళిదాసు ఏకశిలానగరంలో అల్లాణభూపతి కొలువులో ఉన్నాడని తెలిసి, భోజుడు - ఘోటకముఖుడు అక్కడికే బయల్దేరారు.






# భోజకాళిదాసుల సమ్మేళనం


అనుసృజన:
నేతి సూర్యనారాయణ శర్మ


పశుపతి మంచం మీదినుంచి కిందికి ఉరికాడు. సుమ్రత పాదాలమీద పడ్డాడు.

''దేవీ! నీ నిప్పు కన్ను తెరవకు. నేను మాడిపోతాను. ఆ త్రిశూలం విసరకు. తుచ్ఛపు కోరిక కోరినందుకు నన్ను శిక్షింప వచ్చావా? లోకమాతా! నీకు నమస్కారం. నా తప్పు మన్నించు. నన్ను రక్షించు'' అని వేడుకుంటున్నాడు.

సుమ్రత అతడినుంచి దూరంగా జరిగింది.

''నువ్వు ఈ రాత్రికి ఒక వేశ్యకాంత కావాలని రాజుగారిని కోరావట. నన్ను పంపారు. వేగంగా నీ కోరిక తీర్చుకో!'' అని పలికింది.

పశుపతి నిలువునా నీరైపోయాడు.

''అమ్మ బాబోయ్! నీ మాటలు మెత్తగా ఉన్నాయి. కానీ, రూపం చూస్తే మహాశక్తిలా కనిపిస్తున్నది. అహో! నీ వదన బిలం పాతాళంలా ఉన్నది. నాలుక జ్వాలికలా వేలాడుతున్నది. నీ చూపులు శూలాల్లా నన్ను పొడుస్తున్నాయి. అంబా! నీ భయంకరమూర్తిని ఉపసంహరించు'' అని పదేపదే కోరుతున్నాడు.

సుమ్రత నిదానంగా..

''అయ్యో! నేటి ఉదయం మహారాజు చేత మహేశ్వర స్థానంలో అర్చన అందుకున్నావు. నువ్వు మహేశ్వరునివి కావడం వల్ల నీ కంటికి నేను పార్వతిలా కనిపిస్తున్నానేమో.. కానీ, నేను మామూలు స్త్రీనే. సరిగా చూడు'' అంటూ దగ్గరికి రాబోయింది.

అతను పైకి లేచి..

''అయ్యో ఈ వేడికి నా ఒళ్లు మండిపోతున్నది'' అంటూ ఒక్క అంగలో బయటికి పరిగెత్తాడు.

అల్లాణ భూపతి ఉన్న తావుకు పోయాడు.

''మహారాజా! నా కామితం తీర్చిపెడతానని చెప్పి, ఇంత దారుణం చేశావేమిటి? మహాశక్తిని నా మీద ప్రయోగించావెందుకు?! ఇదేనా నీ వ్రత పరాయణత్వం?! నా ఆపద దాటించు. నువ్వు నా కోరిక తీర్చినట్లే భావిస్తాను. అబ్బబ్బా! నా ఒళ్లంతా కాలిపోతున్నది'' అంటూ వేదన పడసాగాడు.

ఇంతలో ఆ గదిలోకి సుమ్రత వచ్చింది.

వెనువెంటనే పశుపతి రెండు చేతులతోనూ ముఖం మూసుకుని..

''అయ్యయ్యో! ఈ వేడికి నా కళ్లు పోయేలాగా ఉన్నాయి. కొంతసేపాగితే గుడ్డివాడినై పోగలను. రాజా! చెడ్డకోరిక కోరినందుకు నువ్వే నాకిలాంటి శిక్ష విధించావు. వేగంగా ఆమె పాదధూళిని తీసి, నా మేనికి పూయి. లేకుంటే నాకు స్వస్థత చిక్కదు. ఇదే నేను నిన్ను కోరిన కోరిక అనుకో!'' అన్నాడు.

అల్లాణ భూపతి వెనక ముందులాడుతున్నాడు. పశుపతిని దగ్గరికి తీసుకుని వీపు నిమిరాడు. దాంతో పశుపతికి శాంతించింది. అతను సుమ్రతకు నమస్కరించి, కొంత పాదధూళిని తన శిరస్సున ధరించాడు.

'దైవం నన్ను సరిదిద్దడానికే ఇటువంటి కోరిక పుట్టించాడు' అనుకుంటూ అల్లాణ భూపతి పిలుస్తున్నా వినిపించుకోకుండా అక్కణ్నుంచి వెళ్లిపోయాడు.

ఏకశిలానగరంలో అల్లాణ భూపతిని గురించి ఈ కథ బహుళ ప్రచారంలో ఉంది. రాజదంపతుల వ్రతదీక్షను గురించి, సుమ్రత పాతివ్రత్యాన్ని గురించి ప్రజలు వేనోళ్ల పొగుడుతుంటారు. అటువంటి ఏకశిలానగరానికి కాళిదాస మహాకవి వచ్చాడు.

* * *

కాళిదాసుకు – భోజరాజుకూ గల మిత్రత్వం లోకోత్తరమైనది. భోజరాజు కవితా ప్రియుడు. ఎవరికైనా కవి పండితులంటే పక్షపాతం ఉండవచ్చు.. కానీ, వారిని ఏకంగా నెత్తికే ఎక్కించుకునేంత ప్రీతి భోజరాజుకు మాత్రమే ఉంది.

ఇక కాళిదాస మహాకవి అంటే.. ఆనాటికీ ఈనాటికీ భరతఖండంలో అతనికి సాటిరాగల మరో కవి లేడని ప్రతీతి. అలాంటివాణ్ని భోజరాజు అమితంగా ప్రేమించాడంటే.. అది అతని తప్పు కాదు. ధారానగరంలో కాళిదాసుకు సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండేవి. కాళిదాసంటే మరో భోజరాజుతో సమానమని మాళవ ప్రజలు భావించేవారు.

భోజరాజుకు నలుగురు భార్యలున్నారు. వారిలో లీలావతికి కవిత్వమంటే ప్రాణం. కాళిదాసుకు ఆమె అంతఃపురంలోకి సైతం అనుమతి ఉండేది. తరచుగా అక్కడికి వస్తూపోతుండటం, భోజరాజు లేని సమయంలో కూడా లీలావతి అంతఃపురంలో కాళిదాసు అప్పుడప్పుడూ ఉండటం.. మిగిలిన వారికి కంటగింపైంది.

భోజరాజు ముందే ఈ విషయంలో చెవులు కొరుక్కునేవారు. పరోక్షంగా లేనిపోని చాడీలు చెబుతుండేవారు.